# హంసధ్వని - హింసధ్వని

- జొన్నలగడ్డ శ్యామల, Hyderabad

అర్ధరాత్రి సమయం. . .

నిశ్శబ్దాన్ని చీలుస్తూ టప్. .టప్. . టప్. . .

మొన్న కురిసిన మంచు కరిగి పైనుంచి బొట్లుబొట్లుగా పడుతోంది.

అంతలో ఆంబులెన్స్ హాహాకారాలు. . . ఎవరికి ఏమయిందో. ప్చ్. ..

క్రమంగా ఆ మోత దూరమయింది.

ఫ్లష్ శబ్దం. . .

పలకరింపులు కరువైన ఈకాలంలో ఇరుగుపొరుగుల ఉనికిని తెలియజేసేవి ఈ ఫ్లష్ శబ్దాలు, షవర్ చప్పుళ్ళే.

డ్రయ్... య్... . య్.. హీటర్ తన ఉనికిని చాటుకోసాగింది. పాతబడితే ఇంతేనేమో.

మొదట్లో 'ఇదెక్కడ మోత' అనిపించింది. కానీ ఇప్పుడు అలవాటు పడిపోయాను.

మరునిముషంలో నాకిష్టమైన రైలుకూత వీనులవిందు చేసింది.

ఈ లెక్సింటన్ లో రైలుస్టేషను వుంది కానీ ప్యాసింజర్ రైళ్ళేమీ లేవు. గూడ్స్ రైళ్ళు మాత్రమే తిరుగుతుంటాయి. ఎవరో కారు డోర్ వేసిన చప్పుడు. ఆపైన పై ఫ్లోర్ లో బూట్ల టకటక ధ్వని.

చప్పుడు అంటే చాలు, నాబాల్యం గుర్తొస్తుంది. అప్పుడు నిజామాబాద్‌లో వుండేవాళ్ళం. అక్షరాభ్యాసం కాగానే నన్ను అక్కతోపాటు స్కూలుకు పంపారు. అప్పటివరకు ఇల్లు, ఇరుగుపొరుగు పిల్లలే ప్రపంచంగా ఉన్న నాకు ఆ స్కూల్లో అడుగుపెట్టగానే అంతా అయోమయంగా, భయంభయంగా అనిపించింది.

అక్కదగ్గరే కూర్చుంటానని పట్టుబట్టాను.

అక్క మంచిది కదా.

సరేనని నన్ను వాళ్ళ క్లాసులోనే తనపక్కన కూర్చోబెట్టుకుంది.

అంతలో వచ్చాడు బ్రహ్మీసాల మాస్టారు.

యమ గంభీరంగా వున్నాడు.

"సైలెన్స్" అని గట్టిగా అరుస్తూ, అంతకంటే గట్టిగా రూళ్ళకర్రతో టేబుల్‌ని చావగొట్టాడు.

అంతే! గట్టిగా ఏడ్చేశాను. "అక్కా! ఇంటికెళ్ళిపోదాం" తన చెయ్యి పట్టుకు లాగుతూ అన్నాను.

"ష్ ఉరుకో కాసేపు. వెళ్దాంలే. ఇదుగో ఈ బొమ్మల పుస్తకం చూడు" అంది నెమ్మదిగా.

మాస్టారు ఏమంటారోనని తన భయం.

"మా చెల్లి. ఇవాళే స్కూల్లో చేరింది." సంజాయిషీగా చెప్పింది మాస్టారికి.

అన్నట్లుగానే లంచ్ అవర్ లో నన్ను ఇంట్లో దింపి మళ్ళీ స్కూలుకి వెళ్ళింది అక్క.

నేను మళ్ళీ ఆ స్కూలు మొఖం చూడలేదు. అంతలో నాన్నకు ఆదిలాబాద్ ట్రాన్స్‌ఫర్ కావడం, అక్కడ నన్ను స్కూల్లో చేర్చడం జరిగాయి. అది వేరే సంగతి. శబ్ద ప్రభావం ఎంతటిదో నా పాఠశాల తొలి అనుభవం చెపుతుంది.

అసలీ ప్రపంచమంతా శబ్దమయమే.

పల్లెకానీ, పట్టణం కానీ దేని శబ్దాలు దానివే.

పల్లె అనుకోగానే 'దాచేపల్లి' కళ్ళముందు కదిలింది. ఆ రోజులే రోజులు.

స్కూలుకు దగ్గరలోనే నాగులేరు. గలగలమంటూ ఎంత ఆహ్లాదాన్ని పంచిపెట్టేదో.

సాయంత్రాలలో పక్షులసందడే సందడి. చింతచెట్లు, పున్నాగచెట్లు, వేపచెట్లు రివ్వున వీచే గాలికి లయబద్ధంగా ఊగుతుండేవి. ఆరోజు సాయత్రం స్కూల్లో ఉండగానే ఆకాశాన్ని మేఘాలు కమ్మేశాయి. ఉరుములు ఉరిమి గాలివాన మొదలైంది. ఆ గాలి తాకిడికి కాంపౌండులో వెలగచెట్టుకున్న కాయలు ఠాప్ ఠాప్ మని పడుతూ ఉంటే మా క్లాసు పిల్లలు మాస్టారికి చిటికెనవేలు చూపించి, బయటకు వెళ్ళి పోటీలుపడి వెలక్కాయలు ఏరుకున్నారు. అందరినీ చూసి ఉత్సాహపడి వెళ్ళేసరికి వెలక్కాయలే కనబడని నేల వెక్కిరించడంతో ఎంత నిరాశపడ్డానో. ఇప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది!

ప్రేయర్ సమయంలో కూడా కుదురుగా వుండేవాళ్ళం కాదు.

మహాత్ముడి వర్ధంతి రోజున రెండు నిముషాలు మౌనం పాటించమంటే ఆ నిశ్శబ్దం ఎంత దుర్భరంగా ఉండేదో. అయిపోయిందంటే ఎంత రిలీఫ్‌గా ఉండేదో. అయినా అల్లరి పిల్లలు ఆ కాసేపట్లో కూడా చిలిపి పనులు చేయడం, మాస్టారు కోప్పడటం జరిగేది.

స్కూలుకెళుతూ మంచినీళ్ళబావి దగ్గర గిలక చప్పుడు వినడం భలే సరదాగా ఉండేది.

ఆ ఊళ్ళో అప్పట్లో కరెంటు ఉండేదికాదు. నడిరాత్రి మెలుకువ వస్తే చిమ్నీ వెలుగు మినుకుమినుకుమంటుండేది. కీచురాళ్ళ రొద, కప్పలబెకబెక, వీధికుక్క ఏడుపు. . . ఇవన్నీ చాలవన్నట్లు వరండాలో తాతయ్య గురక.

నిద్ర రాక అమ్మవైపు చూస్తే అలసటతో ఆదమరిచి నిద్ర పోతుండేది.

అప్పట్నుంచీ ఇప్పటివరకు నేనింతే. ఒక్కరోజు ఒకపట్టాన నిద్ర పట్టదు.

హైదరాబాదులో మాత్రం. . .

వీధిలో వాహనాలగోల, గూర్ఖా లాఠీ చప్పుళ్ళు, ఎవరింటిదగ్గరో బోరుఇంజను చప్పుడు. . .

ఏదయితేనేం నిద్రను దూరం చేసేందుకు.

ఇప్పుడు ఇంతదూరంలో ఉన్నానన్నమాటేకాని, మొన్న యాహూలో చిన్నాతో మాట్లాడుతుంటే వీధిలో బెలూన్లు అమ్మేవాడు చేసిన శబ్దం కూడా వినిపించి ఎంత థ్రిల్ ఫీలయ్యానో.

నాకు ఇష్టమైన ఏక్ తార అతని పాట కూడా వినిపిస్తే బాగుండు అనిపించింది.

సంగీతం గొప్పతనమది. కర్నాటక సంగీతంలో హంసధ్వని రాగం ఎంత బాగుంటుంది!

అన్నట్లు శ్రీబంగారయితే వాళ్ళమ్మ శబ్ద పరిచయాలు చేసినట్లుంది.

పిల్లి ఏమంటుందంటే మ్యావ్ మ్యావ్. . అంటూ మిగతా అరుపులు, కూతలు వరసబెట్టి వినిపించింది.

ఒకప్పుడు మాఇంట్లో ఎన్ని పిచ్చుకలు సందడి చేసేవో. తర్వాత తర్వాత కనుమరుగయ్యాయి. ఇంక పావురాలు చూడటానికి ముచ్చట గొలిపేవి కానీ వెంటిలేటర్ దగ్గర చేరి అరుస్తుంటే చెవులకు బాధాకరంగా ఉండేది.

"అబ్బ!" తలకింద పెట్టుకున్న చెయ్యి నొప్పి పుట్టడంతో తీసేసుకుంటే చేతికున్న ఒకే ఒక బంగారుగాజు మెరిసింది. వెంటనే గలగలమనే మట్టిగాజులు గుర్తొచ్చాయి. గతంలో శృంగారసన్నివేశాల్లో గాజుల గలగల తప్పక వర్ణించేవాళ్ళు. ఇక కాలి అందెల రవళుల సంగతి సరేసరి. అన్నట్లు, ఆమధ్య విశాఖకు వెళ్ళినప్పుడు నాపాదాలను అభిషేకించిన సముద్రపు 'అల' జడి మరువతరమా!

ఏమిటో ఆలోచనలు వదలటంలేదు. లేచివెళ్ళి మంచినీళ్ళు తాగుతుంటే ఫైర్ అలారంపై దృష్టి పడింది.

వచ్చిన కొత్తలో నా తాలింపుమోతకు ఫైర్ అలారం కూడా మోగింది.

మా కాంతి కంగారుపడి, "అమ్మా! త్వరగా ఆ డోరు తెరు" అంది.

తాలింపు శబ్దాలలో కూడా వైవిధ్యం ఉంది. కూర తాలింపు ఓ రకమయితే, సాంబారులో అయితే మరోరకం.

గిన్నెలు, గరిటల సందడి చెప్పనలవికాదు.

కొందరి ఇల్లాళ్ళ కోప ప్రకటన గిన్నెల ఠంగ్, ఠంగ్‌లతోనే.

అతెందుకు, కొంతమంది మాట్లాడుతుంటే గుంటలో రాళ్ళేసి కొడుతున్నట్లుగా వుంటుంది.

కొంతమంది నవ్వితే గాజుగ్లాసులు భళ్ళున బద్దలయిన శబ్దం వస్తుంది.

మధురవాణులు, సుహాసినులు కూడా ఎందరెందరో.

మన ప్రమేయం లేకుండా వచ్చే శబ్దాలు కొన్నుంటాయి.

ఏ ఘాటుకో తుమ్ముతాం, దగ్గుతాం.

అన్నట్లు మొన్న హాస్పిటల్ కు వెళ్ళినప్పుడు థెరపిస్టు సూసన్ పొట్టలో కలకలం స్పష్టంగా వినిపించింది.

ఆమె సిగ్గుపడి, "సారీ, ఐ డింట్ హావ్ ఎనీ బ్రేక్ ఫాస్ట్ టుడే" అంటూ నవ్వింది.

నిన్నటికి నిన్న యూ ట్యూబ్ లో తెలుగు పిక్చరులు వెదుకుతుంటే అదేమిటి చావుకేక, సరిగ్గా గుర్తు రావడంలేదు, అలాంటిదే కనిపించింది. ఇప్పుడు మూవీలకు పెడుతున్న పేర్లు చూస్తుంటేనే వికారంగా వుంటున్నాయి.

ఇక సినిమాల్లో హింసధ్వని ఇంతా అంతా కాదు. ఫైట్ల పేరుతో గాజుతలుపులు, కిటికీలు బద్దలుకొట్టడం, గౌడోన్‌లో డ్రమ్ములన్నింటినీ ఒక్కపెట్టున పడేయటం. . . ఎన్నెన్నో.

వాటికితోడు కొత్త టెక్నాలజితో సౌండ్ ఎఫెక్ట్‌లు కూడా.

ఇలా కర్ణభేరికి చిల్లులు పొడిచే ప్రక్రియలు కోకొల్లలు.

ప్రస్తుతం మనిషి శబ్దకాలుష్య ప్రపంచంలో బతుకుతున్నాడు. అందుకు కారకుడూ అతడే.

చెవులు దెబ్బ తినకుండా, జీవితకాలం చక్కగా పనిచెయ్యాలంటే ధ్వని నియంత్రణ ఉండాలి.

అయినదానికి, కానిదానికి లౌడ్‌స్పీకర్లతో హోరెత్తించడం మానుకోవాలి.

ఇక హారన్ల విషయానికి వస్తే అమెరికాలో హారన్ మోత వినపడదు. హారన్ కొట్టాడు అంటే అది తిట్టినట్లేట.

అదే ఇండియాలో అయితే ఇరవై నాలుగు గంటలూ హారన్లు మోగుతునే ఉంటాయి.

మాట్లాడే హక్కు ఉందని నానోరు, నాఇష్టం అన్నట్లు ప్రవర్తిస్తే కష్టమే.

నిశ్శబ్దంగా ఉండాల్సిన చోట ముఖ్యంగా హాస్పిటల్, లైబ్రరీ వగైరాలలో నిశ్శబ్దాన్ని పాటించి తీరాలి.

ఇక వ్యక్తిత్వానికి దెబ్బ తగిలే సందర్భాల్లో, ఆత్మగౌరవానికి భంగం కలిగే సందర్భాల్లో నిశ్శబ్దంగా ఉండకూడదు.

అప్పుడు గొంతు వినిపించక తప్పదు.

థ్యాంక్ గాడ్ ! ఆలోచనలకు శబ్దం లేదు కాబట్టి సరిపోయింది. లేకపోతేనా. . . అలసటగా అనిపిస్తోంది. నిద్రాదేవత కరుణిస్తోంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. ఇక నిశ్శబ్దమే.

********